క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడపవైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షుడు రసూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాతంత్రవాదులు, మేధావులు, విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే



సమావేశంలో ఫార్మసిస్టులు

కడప కార్పొరేషన్: అంతర్జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఫార్మసిస్టులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ సిద్దయ్య జెండా ఊపి ప్రారంభించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏడురోడ్ల కూడలి వరకూ సాగింది. అనంతరం హోమియోపతి డాక్టర్ మాధవరెడ్డి హాస్పిటల్ దగ్గర మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవరెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, కోట సుబ్బారావు, బాలక్రిష్ణ, రాధాక్రిష్ణ, బద్వేల్ సుబ్బారెడ్డి, మూర్తి, మస్తాన్, సాయి ప్రసాద్, సుధాకర్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



రజనిని అవార్డుతో సత్కరిస్తున్న శారద ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం చిన్నచౌక్‌లోని జీఆర్‌టీజీవీకే స్కూల్ డైరెక్టర్ జి. రజనికి నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు–2025 అందజేశారు. గురువారం హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో 'శారద ఎడ్యుకేషనల్ సొసైటీ' ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కడప నగరానికి చెందిన జి.రజనికి నిర్వాహకులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. విద్యా రంగానికి ఈమె చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా జీఆర్‌టీజీవీకే విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ జి. శంకర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి



శ్రమదానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: అందరి జీవితంలో స్వచ్ఛత ఒక భాగం కావాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మను పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి మిర్జా విలాయత్ అలీ తెలిపారు. గురువారం కడప మను పాలిటెక్నిక్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వర్క్‌షాప్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ అందరూ శ్రమించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఒమర్ ఫరూక్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సికందర్ హుస్సేన్, అధ్యాపకులు డాక్టర్ హకీముద్దీన్, డాక్టర్ పండు, డాక్టర్ అష్రఫ్ పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బాలుడి అప్పగింత



రంగస్వామితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్: వైఎస్ఆర్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠానికి చెందిన గుర్రం గురులక్ష్మి తన కుమారుడు గుర్రం రంగ స్వామి ఇంటి నుంచి పారిపోయాడని తన కుమారుడిని అప్పగించాలని కడపలోని జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామినిని కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్పందించి పారిపోయిన రంగస్వామి ఆచూకీని తెలుసుకునేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ నియమించారు. జడ్జి, పోలీసుల సహకారంతో రంగస్వామి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. అనంతరం రంగస్వామిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌కు అప్పగించారు. చట్టపరంగా చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప అర్బన్: ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి షేక్ ఉమేర్ కలిశారు. ఆయనతో పాటు కడప జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య పాల్గొన్నారు.

జననీ.. శివకామిని.. జయశుభ కారిణి



పోలేరమ్మ ఆలయంలో త్రిపురసుందరీదేవి



వైకుంఠనాథ అలంకారంలో సత్యదేవుడు



లలితాదేవిగా కళాకోటి కళాంబదేవి



అన్నపూర్ణాదేవిగా లలితాంబిక



కుష్మాండ అలంకారంలో విజయదుర్గమ్మ



కాత్యాయని అలంకారంలో లక్ష్మీదేవి

కడప సెవెన్‌రోడ్స్ : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు గురువారం కడప నగర పరిధిలోని దేవునికడపలో ఉభయ దేవేరులతోసహా శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కుష్మాండ అలంకారంలో కొలువుదీర్చారు. తెల్లవారుజామున పవిత్ర నదీజలాలతో నింపిన కలశాలతో అభిషేకించారు. యాగశాలలో చండీ హోమం, నవావరణ చక్రార్చనలు నిర్వహించారు. అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీని గజలక్ష్మిగా అలంకరించారు. భావనారుషి ఆలయంలో అమ్మవారిని బ్రహ్మీదేవిగా అలంకరించారు. స్థానిక గడ్డిబజారులోని కామకోటి కళాంబదేవికి లలితాదేవిగా దర్శనమిచ్చారు. శ్రీ సత్యదేవుని ఆలయంలో స్వామి శ్రీ వైకుంఠనాథ అలంకారంలో భక్తులను ఆశీర్వదించారు. బాల పోలేరమ్మను త్రిపురసుందరీదేవిగా కనుల పండువగా తీర్చిదిద్దారు. నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా తీర్చిదిద్దారు. నడివీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీకామాక్షి దేవిగా అలంకరించారు. శంకరాపురంలోని శ్రీ విజయదుర్గమ్మ అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులను కటాక్షించారు. నాగరాజుపేటలోని



భావనారుషి ఆలయంలో బ్రహ్మీదేవి అలంకారం

రాజరాజేశ్వరీదేవిని అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

ఓం శాంతి భవనంలో..

ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జి సీనియర్ రాజయోగిని బీకే గీతా దీది ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చైతన్యదేవీల దివ్య దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలను బ్రహ్మకుమారీలు ప్రదీప, ఈశ్వరి, నందిని అక్కయ్యలు పాల్గొన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అమ్మవారిని వేడుకున్నారు. కడప నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాన్ని ఎంపీ గురువారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. వాసవీ మాతతోపాటు ఆలయంలోని మిగతా దేవతామూర్తులను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, యానాదయ్య, దేవిరెడ్డి ఆదిత్య, కార్పొరేటర్లు షఫీ, పాకా సురేష్, షంషీర్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షఫీ, దాసరి శివప్రసాద్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



హనుమద్వాహనంపై కడప రాయుడు



దసరా ఉత్సవాల్లో బ్రహ్మకుమారీలు



ఆలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప వైఎస్ఆర్ సర్కిల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. నగర పరిధిలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో కాత్యాయని, లక్ష్మీదేవి, భ్రమరాంబికాదేవి, పార్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

కడప ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈగల్ సెల్ అధికారులు సూచించారు. కడప నగరంలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో గురువారం నార్కోటిక్ సెల్, ఈగల్ సెల్‌తోపాటు జిల్లా కళా జాగృతి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ×డ్రగ్స్ వద్దు బ్రో× కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక, సమస్యల గురించి వివరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌లో భాగంగా పాఠశాల, కళాశాలకు 100 మీటర్ల దూరంలో దుకాణదారులు పొగాకు, బీడీ, సిగరెట్లు, గుట్కాలు, ఖైనీలు విక్రయిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే విద్యార్థులకు వారి తల్లిదండ్రులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, 8977781972 వాట్సాప్ నంబర్‌కు తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీ బి. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నాగరాజు, కళా జాగృతి సభ్యులు, ఈగల్ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈగల్ అధికారులు

బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఒక్కరూ తమ బ్యాంకు ఖాతా నిర్వహణ, ఇతర బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని కెనరా బ్యాంకు రీజినల్ హెడ్ అరుణజ్యోతి పేర్కొన్నారు. గురువారం అరుణజ్యోతి ఆధ్వర్యంలో కడప నగరం ఏడురోడ్ల కూడలిలో ఆగ్మెంటెడ్ కస్టమర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రతతో కూడిన, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ విధానాల గురించి ప్రజలకు తెలియజేశారు. అలాగే కస్టమర్ లైఫ్ సర్టిఫికేట్, నామినేషన్ వంటి సేవలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ మేనేజర్లు ఎస్.రమేష్, విష్ణువర్ధన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో..

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రాంతీయ అధికారి అరుణ జ్యోతి ఆధ్వర్యంలో కడపలోని నెహ్రూ పార్కులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులోని వివిధ విభాగాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించడంతో పాటు స్వచ్ఛ భారత్ లక్ష్యాలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయ నియామకాలపై విచారణ చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయుల నియామకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్, రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు స్పందించాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ విషయమై విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఆర్.యస్.రాజా, వైస్ చైర్మన్ ఎం.అంకన్న మాట్లాడుతూ బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి ఎయిడెడ్ ఉపాధ్యాయులుగా నియమించారని ఆరోపించారు. నియామకాల్లో విద్యాశాఖ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. అవినీతిపై సమగ్ర విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన ప్రజా సంఘాల జేఏసీ నాయకులు ,జయవర్ధన్, సుబ్బారాయుడు, శివకుమార్, కొడవటికంటి నాగరాజు ,ప్రశాంత్, నరేష్, సునీల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

రేపటి నుంచి ధ్యాన దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పోట్లదుర్తి గ్రామం బిస్మిల్లా బాద్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పిరమిడ్ ధ్యాన మహాక్షేత్రంలో శనివారం నుంచి సోమవారం వరకు ధ్యాన దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ధ్యానకేంద్రం అధ్యక్షురాలు కె.ప్రత్యూష, కోశాధికారి రవ్వా అనిల్‌కుమార్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో రోజు సామూహిక సంగీత ధ్యానం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బ్రహ్మర్షి పత్రీజీ సందేశాలు, విశిష్ట అతిథుల పరిచయం, సీనియర్ పిరమిడ్ మాస్టర్ల సందేశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పత్రీజి కుమార్తె పరిణీతి, అల్లుడు శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.జయలక్ష్మి, ట్రస్టీ సి.సుజనాదేవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దసరాకు ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!



కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు

కడప అర్బన్: దసరా సెలవుల్లో చాలా మంది ఊళ్లకు వెళ్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్లేవాళ్లు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు సూచిస్తున్నారు. దొంగల భయంతో సంబరాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదని పోలీసులు భరోసా ఇస్తున్నారు. నగర వాసులు తమ బాధ్యత జాగ్రత్తగా నిర్వహిస్తే.. పోలీసులూ తమ పాత్ర అప్రమత్తంగా పోషించే అవకాశముంటుంది.

- పండుగకు తాళాలు వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటారు. తాళం వేస్తున్న సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు, నగలు, నగదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాటిని బ్యాంకు లాకర్లలో లేదా భద్రత ఉన్న ప్రాంతాల్లో దాచితే మంచిది.
- పక్కింటి వారికి... స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఎప్పుడు వెళ్తున్నారు... తిరిగి ఎప్పుడు తిరిగి వస్తారనే విషయాలను పోలీస్ స్టేషన్‌లో చెబితే రాత్రి సమయాల్లో పోలీసులు ఆయా ఇళ్లపై నిఘా మరింత పెంచే అవకాశముంటుంది.
- ఇళ్ల మీద సీసీ కెమెరాలు ఉండటం ఉత్తమం. ఒకవేళ లేకుంటే సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు.. బస్తీ కెమెరాల గురించి అవగాహన కలిగి ఉండాలి.
- మీరు ప్రయాణంలో ఉన్న విషయం సోషల్ మీడియాలో ఫొటోలను, వీడియోలను షేర్ చేయడం దొంగలకు సంకేతంగా మారుతుంది.'ఇంట్లో ఎవరూ లేరు' అనే సంకేతాన్ని ఇవ్వడం వల్ల మీ ఇంటి భద్రత ప్రమాదంలో పడుతుంది.
- ఇళ్లకు తాళం కనిపించినట్లు కాకుండా... లోపలి నుంచి గడియ పెట్టి వెనక ద్వారానికి తాళం వేసి.. ఇంట్లో ఉన్న లైట్లను ఆన్ చేసి ఉంచితే... ఇంట్లో జనం ఉన్నట్లు కనిపిస్తుంది.
- ఇండిపెండెంట్... ఏకాంతంగా ఉన్న ఇళ్లల్లో నివసించే వారికి రిస్క్ ఎక్కువ ఉన్నందున్న తప్పకుండా పోలీసుల సాయం తీసుకోవాలి.
- నాసిరకం తాళాలు వాడరాదని, తాళం వేసిన అనంతరం బయటకు కనబడకుండా కర్టెన్లు వేయాలని పోలీసులు సూచిస్తున్నారు.
- ఇలాంటి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పండగ హాయిగా జరుపుకోవడమే కాకుండా నేరాలను అదుపు చేసినట్లు అవుతుంది. 'మీ భద్రత–మా బాధ్యత, కానీ మీ జాగ్రత్త– మాకు అదనపు బలం' అని డీఎస్పీ వివరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్ : కడపనగరంలోని అక్కాయపల్లె పార్క్ ఎదురుగా ఉన్న వేదాంత హాస్పిటల్స్‌లో శనివారం ప్రొస్టేట్ గ్రంధి సమస్యపై పురుషుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కిడ్నీ, మూత్రపిండాల వ్యాధి నిపుణులు డాక్టర్ ఎన్. దినేష్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొస్టేట్ గ్రంధి పురుషుల్లో వీర్యాన్ని ఉత్పత్తి చేసే, మూత్ర ప్రవాహాన్ని నియంత్రించే గ్రంధి అని తెలిపారు. ఇది మూత్రశయం కిందిభాగంలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రొస్టేట్ గ్రంధి పెద్దదిగా మారి మూత్ర ప్రవాహాన్ని అడ్డుకుంటుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారికి మూత్రం సన్నగా రావడం, ఎక్కువసార్లు రావడం, మంట, మూత్రం రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి సమస్య ఉన్నవారు యూరాలజీ వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. 50 సంవత్సరాలు దాటిన వారిలో ఎక్కువగాపై లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి వారి కోసం వేదాంత హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కడప అర్బన్: కడప నగరం బిల్టప్ సర్కిల్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కడప తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, సిబ్బందితో మట్టి తోలించి రోడ్డుపై గుంతలు పూడ్చి వేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జర్మన్ లాగ్వేంజ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ రంగంలో జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉన్నాయని, అక్కడి ఆస్పత్రులు, హెల్త్‌కేర్ సెంటర్లు నైపుణ్యం ఉన్న నర్సింగ్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని వివరించారు. జర్మన్ లాగ్వేంజ్ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులకు జర్మనీతోపాటు యూరప్ దేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కెరీర్ నిర్మించుకునే అవకాశం పొందుతారన్నారు. విద్యార్థులు ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార ప్రాధ్యానతను గుర్తించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీవాణి తెలిపారు.

గురువారం కడప అర్బన్‌లోని ఎర్రముక్కపల్లె యూపీహెచ్‌సీ ప్రాంగణంలో 8వ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేది వరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు బాల్యదశ సంరక్షణ, స్థూలకాయ నివారణ, శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి మహిళ గర్భిణిగా ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోవడంతోపాటు బిడ్డ జన్మించిన తర్వాత బిడ్డకు నిర్ణీత వయస్సు వచ్చిన తర్వాత ఆ బిడ్డ పట్ల మరింత ఎదుగుదల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రముక్కపల్లి యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ రియాజ్ అహ్మద్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ హరిత, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ శ్రీవాణి, ఐసీడీఎస్ అధికారులు

విభజన హామీలు అమలు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విభజన హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బందె ఓబయ్య పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయంలో అక్టోబర్ 16న రాయలసీమ విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాయలసీమలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను తక్షణము పూర్తి చేసి, సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలోపార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శంకర్,రాష్ట్ర కార్యదర్శి బంగారు రాజు, కార్యవర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ పాల్గొంటారని తెలిపారు.